క్లుప్తంగా

బస్టాండ్‌లో చలివేంద్రం ప్రారంభం


భీమవరం బస్టాండ్‌లో మజ్జిగ పంపిణీ చేస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశం చౌక్): స్థానిక బస్ స్టేషన్‌లో దాత బీహెచ్ఎస్ సూర్యనారాయణ రాజు (బొంబాయి రాజు) సహకారంతో మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభించామని డిపో మేనేజర్ గిరిధర్ కుమార్ తెలిపారు. కార్యక్రమంలో ఎంఎస్ సూర్య ప్రకాశరావు (రిటైర్డ్ ఈడీ ఆర్టీసీ), విజ్ఞాన వేదిక కన్వీనర్ చెరుకువాడ రంగసాయి, అసిస్టెంట్ మేనేజర్ సురేష్, అలియన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ మెంబర్స్ పి.సుభద్ర దేవి, కేర్ కమిటీ చైర్మన్ డి.భవానీ శీతల్ తదితరులు పాల్గొన్నారు.

హైజినిక్ కిట్ల పంపిణీ


కిట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

భీమవరం(ప్రకాశం చౌక్): ప్రపంచ రెడ్ క్రాస్ దినోత్సవం సందర్భంగా సోమవారం ఉదయం చైర్మన్ భద్రిరాజు ఆధ్వర్యంలో రెడ్ క్రాస్ బ్లడ్ సెంటర్‌లో రాయలం, చినమిరం పంచాయతీ పారిశుధ్య కార్మికులు సుమారు 50 మందికి హైజినిక్ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ బద్రిరాజు మాట్లాడుతూ బ్లడ్ డొనేషన్ అవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కిషోర్, రెడ్ క్రాస్ మేనేజ్మెంట్ కమిటీ మెంబర్లు తిరుపతి రాజు, గోపాలకృష్ణ రాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యావ్యాపారాన్ని అరికట్టాలి


డీఈఓ వెంకటరమణకు వినతిపత్రం అందిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

సాక్షి, భీమవరం: ప్రభుత్వ నిబంధనలు పాటించని కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో సోమవారం జిల్లా విద్యాశాఖాధికారి ఆర్ వెంకటరమణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు పి.వాసు మాట్లాడుతూ జిల్లాలో కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలు పుస్తకాలు, యూనిఫామ్ పేర్లతో వ్యాపారం చేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం అధికారికంగా అడ్మిషన్లు ప్రారంభించక ముందే విద్యా సంస్థలు విద్యను వ్యాపారంగా మార్చారని వాపోయారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి టి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన

నరసాపురం రూరల్: పట్టణంలోని శ్రీహరిపేట 1వ వార్డులో మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ సోమవారం పర్యటించారు. వార్డులో తాగునీటి సరఫరా, డ్రైన్లు, పారిశుధ్య పనుల నిర్వహణను క్షుణ్ణంగా పరిశీలించారు. ఆమెవెంట మున్సిపల్ కమిషనర్ కె వెంకటేశ్వరరావు, వార్డు కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రేపటి నుంచి హనుమజ్జయంత్యుత్సవాలు

పాలకొల్లు సెంట్రల్: స్థానిక యడ్లబజారు సెంటర్లో కొలువై ఉన్న పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయంలో రేపటి నుంచి హనుమజ్జయంత్యుత్సవాలు ప్రారంభించనున్నారు. ఈ నెల 14న హనుమజ్జయంతి సందర్భంగా బుధవారం నుంచి ఆలయంలో స్వామివారికి గంధసిందూరం, తమల పాకులు, తులసీ దళాలతో సామూహిక సహస్ర నామార్చనలు నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధానార్చకులు రమణ స్వామి తెలిపారు. ఈ పూజలు చేయించుకునే భక్తులు పూజా ద్రవ్యముల కొరకు రూ. 558 నగదు చెల్లించాలన్నారు.

ప్రత్యేక అలంకరణలో క్షీరారామలింగేశ్వరస్వామి


ప్రత్యేక అలంకరణలో క్షీరారామలింగేశ్వరస్వామి

పాలకొల్లు సెంట్రల్: స్థానిక క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. సోమవారం ఉదయం భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారికి అభిషేకాలు, జనార్దనస్వామికి అర్చనలు, లక్ష్మీపార్వతి అమ్మవార్లకు కుంకుమ పూజలు, గోపూజ చేశారు. రాత్రి 7 గంటలకు స్వామివారికి పంచహారతుల కార్యక్రమం ఏర్పాటు చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి


ఆకివీడులోని శాఖా గ్రంథాలయంలో విజ్ఞాన శిబిరంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు

ఉండి : ప్రతి ఒక్కరూ గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ ఇందుకూరి శ్రీహరి నారాయణరాజు (హరిబాబు) అన్నారు. సోమవారం ఉండి శాఖ గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన వేసవి శిక్షణా తరగతులను ఎంపీపీ హరిబాబు, సర్పంచ్ కమతం సౌజన్య ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పుస్తక పఠనం వలన మేథోశక్తి పెరుగుతుందన్నారు. వేసవి శిక్షణా తరగతులు ద్వారా విద్యార్థులు కొత్త విషయాలు నేర్చుకునే అవకాశం దక్కిందని, వీటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు కమతం బెనర్జీ, వెటర్నరీ జేడీఏ డాక్టర్ మల్లేశ్వరరావు, నల్లా ప్రసాద్, లైబ్రేరియన్ జేవీ కృష్ణమూర్తి, మహంకాళి తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాలు.. మంచి నేస్తాలు

మనం నిరంతరం వినియోగిస్తున్న సెల్‌ఫోన్ కంటే గ్రంథాలయం గొప్పదని వైస్ ఎంపీపీ దత్తాల సుజాతరాణీ, యండగండి సర్పంచ్ గోగులమండ చినకృష్ణమూర్తి అన్నారు. సోమవారం యండగండిలో గ్రంథాలయ వేసవి శిక్షణా తరగతులను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పుస్తకాలు మంచి నేస్తాలని వాటితో స్నేహం చేసిన వారెవరూ చెడిపోలేదన్నారు. అందుకే గొప్ప విజ్ఞానాన్ని పంచే పుస్తకాలను నిరంతరం చదవాలన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి ఎన్‌సీహెచ్ రామకృష్ణ, అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు వేగేశ్న సత్తిబాబు, తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో జ్ఞాపకశక్తి పెంపు

ఆకివీడు : పుస్తకాలు చదవడం, రాయడంతో జ్ఞాపకశక్తి పెంపొందించుకోవచ్చని నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి అన్నారు. స్థానిక మాదివాడలోని శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాన్ని సోమవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు అధికంగా సెల్‌ఫోన్‌లు పట్టుకుని తిరుగుతున్నారని ఇది మంచిది కాదన్నారు. వేసవి విజ్ఞాన శిబిరాలను వినియోగించుకుని విద్యార్థులు ప్రపంచ జ్ఞానాన్ని పొందాలని ఇందుకు తల్లిదండ్రులు సహకరించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన రీడర్స్ ఫోరం అధ్యక్షుడు దాసరి వెంకట సత్యనారాయణ మాట్లాడుతూ కథల పుస్తకాలు, సమరయోధుల జీవిత చరిత్ర పుస్తకాలు, ఇతర విలువైన గ్రంథాలు చదవడం ద్వారా విజ్ఞానం పెరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చీఫ్ విప్ పడాల శ్రీనివాసరెడ్డి, వైస్ చైర్మన్లు పుప్పాల పండ, వంగా జ్యోత్స్న, కౌన్సిలర్లు నిమ్మల నాగు, మోటుపల్లి కుమారి, ఎండీ.జక్కీ, దొడ్డి జగదీష్, ఆలీ, ఎంఈఓ ఏ.రవీంద్ర, ప్రధానోపాధ్యాయులు, రిటైర్డ్ హెచ్ఎంలు, గ్రంథ పాలకురాలు కె.పార్వతి తదితరులు పాల్గొన్నారు.

కోపల్లెలో వేసవి విజ్ఞాన శిబిరం

కాళ్ల : పుస్తక పఠనంతో మేథోశక్తి పెంపొందించుకోవచ్చని ఎంఈఓ ఏ రవీంద్ర అన్నారు. సోమవారం మండలంలోని కోపల్లె గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన వేసవి విజ్ఞాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ జూన్ 11 వరకు నిర్వహించనున్న విజ్ఞాన శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన వైఎస్సార్ సీపీ నాయకులు పెన్మెత్స విశ్వనాథరాజు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు మిగిలిన నైపుణ్యాలను కూడా పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు సుభాషిణి, లైబ్రేరియన్ స్వరూప రాణి, స్టేట్ రిసోర్స్‌పర్సన్ బీఆర్ఎంకే స్వామి, ఉపాధ్యాయులు కృష్ణంరాజు, ధనశ్రీ, వెంకీనాయుడు, గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వేసవి సెలవులను వినియోగించుకోవాలి

సాక్షి, భీమవరం: స్థానిక డాక్టర్ వైఎస్సార్ ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయంలో సోమవారం వేసవి విజ్ఞాన శిబిరాన్ని జిల్లా విద్యాశాఖాధికారి ఆర్ వెంకటరమణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు, యువత వేసవి సెలవుల్లో గ్రంథాలయాన్ని వినియోగించుకోవాలని సూచించారు. విద్యార్థుల్లో పుస్తక పఠనం ద్వారా రీడింగ్ స్కిల్స్ పెరుగుతుందని, పుస్తక సమీక్ష చేయడం, కథలు, దేశనాయకుల జీవిత చరిత్రలు చదవడం వల్ల ఎంతో నాలెడ్జ్ పెరుగుతుందని చెప్పారు. వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహణకు దాతలు, రిటైర్డ్ ఉద్యోగులు, శ్రీవిజ్ఞాన్ వేదిక, అరసవల్లి చారిటబుల్ ట్రస్టు సహకారం అభినందనీయమని తెలిపారు. అనంతరం పుస్తక పఠనం, కథలు చెప్పడం, తెలుగు పద్యాలు, యోగ, డ్రాయింగ్ నేర్పించడం ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి ఎస్ వెంకటేశ్వరరావు, చదువరుల సంఘం అధ్యక్షుడు అరసవల్లి సుబ్రహ్మణ్యం, చెరుకువాడ రంగసాయి, సుధారాణి, గోపాలశర్మ, రామ నాగేశ్వరరావు, లక్ష్మి, శ్యామల, పద్మ తదితరులు పాల్గొన్నారు.


ఉండిలో వేసవి శిక్షణా శిబిరాన్ని ప్రారంభించిన ఎంపీపీ, సర్పంచ్


విజ్ఞాన శిబిరం ప్రారంభిస్తున్న ఎంఈఓ రవీంద్ర


భీమవరం శాఖాగ్రంథాలయంలో యోగాసనాలు

బీజేపీ బలోపేతానికి కృషి


ఉండిలో సమావేశమైన బీజేపీ నాయకులు

ఉండి : గ్రామీణ స్థాయిలో బీజేపీ బలోపేతానికి కృషి చేస్తున్నామని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. సోమవారం ఉండిలో పార్టీ జిల్లా నాయకుడు కొమ్మన నాగబాబు ఆధ్వర్యంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పేరిచెర్ల సుభాష్‌రాజు అధ్యక్షతన పార్టీ ముఖ్య నాయకుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస వర్మ, సుభాష్‌రాజు మాట్లాడుతూ గత పాలకులు దేశాన్ని అథోగతిపాలు చేస్తే నరేంద్రమోదీ మాత్రం దేశాన్ని ప్రపంచ ఉత్తమ దేశాల సరసన నిలిపారన్నారు. దేశాన్ని పారిశ్రామికంగా, సాంకేతికంగా ఎంతో అభివృద్ధి చేశారన్నారు. మన దేశం జోలికి రావాలంటే శత్రుదేశాలకు హడలు పుట్టించిన ఘనత నరేంద్రమోదీకి దక్కుతుందన్నారు. అందుకే ఆయనకు మళ్ళీ పట్టం కట్టేందుకు దేశ ప్రజలంతా ఎదురు చూస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కోరా రామ్మూర్తి, ఇంకేటి వెంకటేశ్వర్లు, సుంకర కాశీ, యర్రా విక్రమ్, ఐకే రాజు, లక్ష్మీపార్వతి, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

ఫ్యామిలీ ఫిజీషియన్ ద్వారా వైద్య సేవలు


కొత్తపేటలో ఫ్యామిలీ ఫిజీషియన్ శిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ కవురు భారతి

పాలకొల్లు అర్బన్: ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఫ్యామిలీ ఫిజీషియన్ ప్రత్యేక వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ కవురు భారతి అన్నారు. పాలకొల్లు మండలం కొత్తపేట గ్రామ సచివాలయం వద్ద సోమవారం ఏర్పాటు చేసిన ఫ్యామిలీ ఫిజీషియన్ ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఆమె సందర్శించి రోగులకు వైద్య సేవలు అందిస్తున్న వైద్య బృందాన్ని ప్రత్యేకంగా అభినందించారు. ఎంపీటీసీ పెదపాటి వెంకటరత్నం, వైసీపీ నాయకుడు కవురు భాస్కరబాబు, పంచాయతీ కార్యదర్శి ఓదూరి సూర్యప్రకాశరావు, సచివాలయ కార్యదర్శి మానెం జానకిరామచంద్ర, మెడికల్ ఆఫీసర్ డా.లీనా సుప్రియ, హెచ్‌వీ స్వర్ణలత, ఎంఎల్‌హెచ్‌పీ అనూష, ఏఎన్ఎం సునీత, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

కాపవరంలో....

కాపవరం సచివాలయ ఆవరణలో లంకలకోడేరు పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డా. అద్దాల ప్రతాప్‌కుమార్ రోగులకు వైద్య సేవలందించారు. గర్భిణీలు, బాలింతలు, డయోబెటిక్, రక్తహీనత, ఇతర అనారోగ పీడితులను పరీక్షించి వైద్య సేవలందించారు. ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మేడపాడు వెంకమ్మ జాతర


మేడపాడులో గ్రామదేవతలు వెంకమ్మ, కనకదుర్గమ్మ, జువ్వాలమ్మ అమ్మవార్ల జాతర

యలమంచిలి: మేడపాడు గ్రామ దేవతలు వెంకమ్మ, కనకదుర్గమ్మ, జువ్వాలమ్మ అమ్మవార్ల జాతర ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్తల ఆధ్వర్యంలో జాతర నిర్వహణ కమిటీ పర్యవేక్షణలో అమ్మవార్ల ఘటాలకు ఆదివారం రాత్రి గ్రామానికి దక్షిణం వైపున సోమవారం రాత్రి ఉత్తరం వైపున జాతర నిర్వహించారు. మంగళవారం రాత్రి బలిహరణ, ఊయల ఉత్సవం నిర్వహించి అమ్మవార్లను ఆలయ ప్రవేశం చేస్తారు. అప్పటి నుంచి ఐదు రోజులపాటు తీర్థ ఉత్సవాలు నిర్వహించడంతోపాటు ఆఖరి రోజు మాంసాహారంతో అన్నసమారాధన ఏర్పాటు చేయడంతో జాతర ఉత్సవాలు ముగుస్తాయని ధర్మకర్తలు, జాతర ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా అమ్మవార్ల ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు.

తడసిన ప్రతి ధాన్యం గింజకూ మద్దతు ధర


అడవిపాలెంలో రైతులతో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ కవురు శ్రీనివాస్

యలమంచిలి: అకాల వర్షాలకు తడసిన ప్రతి ధాన్యం గింజకు ప్రభుత్వం పూర్తి మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేస్తుందని, ఈ విషయంలో రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జెడ్పీ చైర్మన్ కవురు శ్రీనివాస్ రైతులకు భరోసా ఇచ్చారు. మండలంలోని వివిధ గ్రామాల్లో సోమవారం ఆయన పర్యటించి తడచిన ధాన్యం రాశులను పరిశీలించారు. అనంతరం అడవిపాలెం రైస్‌మిల్లు వద్ద రైతులతో ఆయన మాట్లాడారు. తడసిన ధాన్యానికి మద్దతు ధర ఇచ్చే విషయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇప్పటికే అధికారులకు ఆదేశాలిచ్చారన్నారు. క్షేత్రస్థాయిలో అధికారులు పర్యటించి రైతులకు పూర్తి మద్దతు ధర అందేలా చర్యలు తీసుకుంటారన్నారు. ఆఫ్‌లైన్‌లో ధాన్యం అమ్మకానికి ప్రభుత్వం అనుమతి ఇచ్చిందన్నారు. ఆఫ్‌లైన్ అమ్మకాల్లో రైతులకు ఎటువంటి ఇబ్బంది వచ్చినా సంబంధిత రైతు భరోసా కేంద్రాలకు వెళ్లి వ్యవసాయ సిబ్బందికి సమాచారమిస్తే వ్యవసాయ అధికారులు మీకు అండగా ఉండి న్యాయం చేస్తారన్నారు. శ్రీనివాస్ వెంట ఎస్సీ కమిషన్ సభ్యులు చెల్లెం ఆనందప్రకాష్, వైఎస్సార్ సీపీ నాయకులు తోట రామకృష్ణ, బుంగా జయరాజు, సిర్రా నాగరాజు, బొలిశెట్టి గణపతి, ఉదయ భాస్కర్ ఉన్నారు.

లక్ష్మీపాలెం గ్రామ దేవతల దర్శన

లక్ష్మీపాలెం గ్రామ దేవతలు కనకదుర్గమ్మ, మారమ్మ, పోతురాజు జాతర సందర్భంగా సోమవారం లక్ష్మీపాలెం వెళ్లి గ్రామ దేవతలను జెడ్పీ చైర్మన్ కవురు శ్రీనివాస్ దర్శించుకున్నారు. అమ్మవార్లకు పూలమాలలు వేసి, కొబ్బరికాయ కొట్టి నైవేద్యం సమర్పించారు. ఈ సందర్భంగా జాతర నిర్వాహకులు ఏర్పాటుచేసిన అన్నసమారాధనను శ్రీనివాస్ ప్రారంభించారు. ఆయన వెంట ఎస్సీ కమిషన్ సభ్యులు చెల్లెం ఆనందప్రకాష్, సర్పంచ్ గటిగంటి మహేష్, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు మోకా ఏడుకొండలు వైఎస్సార్ సీపీ నాయకులు ఆరుమిల్లి లక్ష్మణరావు, మోకా ప్రేమ్‌చంద్ ఉన్నారు.

కాళ్లకూరు వెంకన్నకు ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకణలో స్వామి అమ్మవార్లు

కాళ్ల : కాళ్లకూరులో వేంచేసియున్న స్వయంభూ శ్రీ వేంకటేశ్వర స్వామివారి దేవస్థానంలో శ్రీ స్వామివారి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి అమ్మవార్లకు భక్తులందరితో కలిసి ద్వాదశ కోవెల ప్రదక్షిణలు చేశారు. దేవస్థానం ధర్మకర్తల మండలి అధ్యక్షుడు దండు వెంకట కృష్ణంరాజు-స్రవంతి దంపతులచే చక్రాబ్ది మండలార్చన, శ్రీ పుష్పయాగం, ద్వాదశ ప్రసాదములు నివేదన, నీరాజన, మంత్రపుష్పములు ఘనంగా జరిపారు. అనంతరం భక్తులందరికీ 12 రకాల విశేష ప్రసాదాల వితరణ చేశారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యంకలగకుండా దేవస్థానం కార్యనిర్వహణాధికారి మోకా అరుణ్ కుమార్ పాలకమండలి అధ్యక్షుడు దండు వెంకట కృష్ణంరాజు, సభ్యులు, సిబ్బంది ఏర్పాట్లు చేశారు.

రామరాజుకు సత్కారం


డాక్టరేట్ పొందిన రామరాజును సత్కరిస్తున్న దృశ్యం

కాళ్ల : దాట్ల శ్రీదేవి మెమోరియల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు దాట్ల వెంకట రామరాజుకు డాక్టరేట్ లభించడం అభినందనీయమని ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ బహుజన సమైక్య వ్యవస్థాపకుడు సోడదాసి గంగయ్య అన్నారు. కాళ్ల మండలం కాళ్లకూరు గ్రామంలో దాట్ల శ్రీదేవి మెమోరియల్ ట్రస్ట్ సేవలను గుర్తించి దాట్ల వెంకట రామరాజుకు ఆసియా ఖండంలో ఆషియన్ ఇంటర్నేషనల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ వారు గౌరవ డాక్టరేట్ బిరుదు ప్రదానం చేసి సత్కరించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ బహుజన సమైక్య సభ్యులు రామరాజును సోమవారం ఘనంగా సన్మానించారు. సేవలను మరింత విస్తృతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి గుడిసే అనిల్ కుమార్, కాళ్ల మండల అధ్యక్షుడు కొనా రంజిత్, పాస్టర్ అహరోను, గాతల సందీప్, తాళ్లూరి రాజ్ కుమార్, గొల్ల ఆశీర్వాదం, పొరువుడి యోహాను, బుంగా దానియేలు, ఈద భోగేష్, జి.రాజేష్, చిలీ కాసులు తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా చండీహోమం


ఆలయంలో చండీహోమం నిర్వహిస్తున్న దృశ్యం

భీమవరం(ప్రకాశం చౌక్): స్థానిక మెంటేవారి తోటలో కొలువైన శ్రీబాలత్రిపుర సుందరీదేవి అమ్మవారి దేవస్థానం వార్షికోత్సవాల్లో భాగంగా సోమవారం సంప్రదాయబద్ధంగా చండీహోమం నిర్వహించారు. ఆలయ అర్చకుడు కొమ్ము శ్రీనివాస్ అధ్వర్యంలో తొలుత అమ్మవారికి సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు, గణపతి హోమం, విజయ గణపతికి గరిక పూజ నిర్వహించారు. అనంతరం మద్దాల సత్యనారాయణ, లక్ష్మి బ్రహ్మాజీ దంపతులచే చండీహోమం చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

జూదరుల అరెస్టు

భీమవరం అర్బన్: భీమవరం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం డేగాపురంలో పేకాట శిబిరంపై దాడిచేసి ఐదుగురిని అదుపులోకి తీసుకున్నట్టు ఎస్సై మోహన్‌రావు తెలిపారు. వారి నుంచి రూ.2,400 స్వాధీనం చేసుకున్నామని, కేసు నమోదు చేశామని పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంపై కేసు నమోదు

ఆకివీడు : స్థానిక సిద్ధాపురం రోడ్డులో ధర్మాపురం వద్ద ఈ నెల 6వ తేదీన జరిగిన రోడ్డు ప్రమాదంపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై కె.రాజారెడ్డి చెప్పారు. ధర్మాపురం వద్ద నడిచి వెళుతున్న బొండాల దుర్గ ప్రసన్నను మోటార్‌సైక్లిస్టు ఢీకొట్టగా ఆమె రోడ్డుపై మరో పక్కగా పడగా లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆమె కాలు నుజ్జయిన విషయం తెలిసిందే. విజయవాడ ఆంధ్ర హాస్పటల్‌లో చికిత్స పొందుతున్న ఆమె ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

ట్రాక్టర్‌ను ఢీకొన్న ప్రమాదంలో తీవ్ర గాయాలు

మొగల్తూరు, మొగల్తూరు జాతీయ రహదారిపై సోమవారం రాత్రి జరిగిన ప్రమాదంలో యువతీ, యువకుడుకి తీవ్ర గాయాలయ్యాయి. సీఐ సురేష్ బాబు తెలిపిన వివరాల ప్రకారం మొగల్తూరులోని హెచ్‌పీ పెట్రోల్ బంక్ సమీపంలో ఆగి ఉన్న ట్రాక్టర్‌ను వెనుక వైపు నుంచి స్కూటీపై ప్రయాణిస్తున్న యువతీ, యువకుడు బలంగా ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. వారిని 108 వాహనంలో నరసాపురం ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. క్షతగాత్రుల వివరాలు తెలియాల్సి ఉందన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సాక్షి, భీమవరం: వేమగిరి సబ్‌స్టేషన్‌లో కొత్త పనుల నిమిత్తం 220 కేవీ వేమగిరి – ఉండి ఫీడర్లో విద్యుత్ సరఫరాను బుధవారం ఉదయం 8 నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిలుపుదల చేస్తున్నట్టు ఈఈ పీర్ అహ్మద్ ఖాన్ తెలిపారు. 132 కేవీ భీమవరం, ఆకివీడు, ఉండి సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ సరఫరా రొటేషన్ బేసెస్లో లోడ్ రిలీఫ్ ఉంటుందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో భీమవరం పట్టణంలో, వీరవాసరం మండలం, ఆకివీడు మండలం, ఉండి మండలం, కాళ్ల, పాలకోడేరు మండలంలోని శృంగవృక్షం, బంటుమిల్లి, విస్సాకోడేరు, మోగల్లు, కుముదవల్లి, పాలకోడేరు గ్రామాల్లో ఉదయం 8 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తామని పేర్కొన్నారు.

తపాలా బీమా ఏజెంట్ల ఎంపికకు 15న ఇంటర్వ్యూలు

సాక్షి, భీమవరం: భీమవరం పోస్టల్ డివిజన్ పరిధిలో తపాలా జీవిత బీమా, గ్రామీణ తపాలా జీవిత బీమా పథకంలో కమిషన్ బేసిక్‌పై ఏజెంట్లుగా పనిచేయడానికి దరఖాస్తులు కోరుతున్నట్టు భీమవరం డివిజన్ సీనియర్ సూపరింటెండెంట్ పి.బాలసుబ్రహ్మణ్యం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. టెన్త్, ఇంటర్ విద్యార్హత గల అభ్యర్థులు ఈనెల 15న భీమవరం హెడ్ పోస్టాఫీసులు ఉదయం 11 గంటలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. అభ్యర్థులు బయోడేటా, ఒరిజినల్ సర్టిఫికేట్స్‌తో హాజరుకావాలని ఆయన పేర్కొన్నారు.

స్పందనకు ఏడు ఫిర్యాదులు

ఆకివీడు : స్పందన కార్యక్రమానికి ఏడు ఫిర్యాదులు వచ్చినట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎస్.శ్రీకర్ సోమవారం చెప్పారు. ఇంటింటికీ వెళ్లే రేషన్ వాహనం షాపు నెం.29, 30, 31కి సంబంధించి రేషన్ బియ్యం రోడ్డుమీదే ఇస్తున్నారని, స్థానిక వనువులమ్మవారి గుడి వద్ద ఉన్న ప్రభుత్వ ఖాళీ స్థలం ఆక్రమణలకు గురవుతుందని ఫిర్యాదు వచ్చిందన్నారు. సమరయోధుడు స్వర్గీయ మోరా కుటుంబ రెడ్డికి ఇచ్చిన ఇంటి స్థలం రెండు సెంట్లు కన్పించడంలేదని, పట్టా స్థలం ఇప్పించాలని, తన భర్త నుంచి తనకు రక్షణ కల్పించి, అతని నుండి వేరు చేయాలని తదితర ఫిర్యాదులు వచ్చాయని చెప్పారు.

ఆర్‌ఆర్‌డీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు

సాక్షి, భీమవరం: స్థానిక ఆర్‌ఆర్‌డీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభిస్తునట్టు కళాశాల ప్రిన్సిపాల్ వీకేజీ ప్రసూన సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాల సిబ్బంది పట్టణం పరిసర ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేస్తున్నారన్నారు. తమ కళాశాలలో బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సులున్నాయని అనుభవం కలిగిన అధ్యాపకులతో విద్యాబోధన చేస్తున్నామని ఇంటర్మీడియట్ పాసయిన విద్యార్థులు ఈనెల 10 నుంచి కళాశాల కార్యాలయంలో అడ్మిషన్ల కోసం పేర్లు నమోదు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ప్రసూన తెలిపారు. వివరాల కోసం 08816 22345, సెల్ నెంబర్ 98664 45077కు సంప్రదించాలని ఆమె కోరారు.

ఐఏఎల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా రంగారావు

సాక్షి, భీమవరం: ఆల్ ఇండియా లాయర్స్ అసోసియేషన్ (ఐఏఎల్) రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా భీమవరం పట్టణానికి చెందిన న్యాయవాది చెల్లబోయిన రంగారావు ఎన్నికయ్యారు. రాజమహేంద్రవరంలో నిర్వహించిన ఐఏఎల్ రాష్ట్ర మహాసభల్లో నూతన కమిటీ ఎన్నిక నిర్వహించినట్టు రంగారావు సోమవారం భీమవరంలో విలేకర్లకు తెలిపారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన నెక్కంటి క్రాంతికుమార్(నరసాపురం), అశోక్‌కుమార్ (తణుకు), వైవీ ఆనంద్ (తాడేపల్లిగూడెం), యేలేటి న్యూటన్, మల్లుల శ్రీనివాసు(భీమవరం), బండి వెంకటేశ్వరరావు(ఏలూరు), నున్న సీతారామయ్య(జంగారెడ్డిగూడెం) రాష్ట్ర కార్యవర్గసభ్యులుగా ఎన్నికైనట్టు వివరించారు.

సగంచెరువులో హిందూ ధర్మప్రచారం

పాలకొల్లు అర్బన్: జీవాత్మ, ఆత్మ, పరమాత్మ అనే మూడు ఆత్మల వివరం తెలుసుకోవడం వల్ల మధ్యాత్మ ఆరాధనతో ధర్మముల స్థాపన జరుగుతుందని త్రైత సిద్ధాంతం-ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక (మామిడికుదురు) కమిటీ అధ్యక్షుడు బండారు సత్యనారాయణ అన్నారు. పాలకొల్లు మండలం సగంచెరువులో సోమవారం హిందూ ధర్మ ప్రచార సమితి ఆధ్వర్యంలో త్రైత సిద్ధాంతాన్ని వివరించారు. గ్రామంలోని భక్తులకు భగవద్గీత గ్రంథాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హనుమంతరావు, బ్రహ్మాజీ, అభిమన్యరాజు, విశ్వనాథ్, సత్యవతి పాల్గొన్నారు.